# ‘అమెజాన్’లో యూనియన్ ఏర్పాటు

**దాదాపుగా** గత సంవత్సర కాలంగా, ప్రాణాంతక మహమ్మారి నడుమనే, అమెజాన్ సంస్థకు చెందిన ‘రీటైల్, హోల్‌సేల్, డిపార్ట్‌మెంట్ స్టోర్స్, గోడౌన్ల కార్మికుల, నిర్వాహకుల యూనియన్ (ఆర్‌డబ్ల్యుడిఎస్‌యు)’ ఒక చారిత్రక విన్యాసానికి రంగం సిద్ధంచేసింది. అమెరికాలో మొదటి అధికారయుత అమెజాన్ యూనియన్‌ను కార్మికులు ఏర్పాటు చేశారు. అల్బామాలోని బెస్సెమర్ అమెజాన్ సెంటర్‌లో పనిచేసే దాదాపు 5,800 మంది కార్మికులకు ఈ యూనియన్ ప్రాతినిధ్యం వహిస్తోంది. అర్‌డబ్ల్యుడిఎస్‌యు మద్దతుతో, ఈ గోడౌన్లలో పనిచేసే కార్మికులు (వీరిలో 75-80 శాతం కార్మికులు నల్ల జాతీయులు) భద్రత లేని అసమంజసమైన తమ పని పరిస్థితులపై పోరాడి వాటిని వెనక్కు నెట్టివేయగలిగారు. ఇదే అమెజాన్ వ్యాపార పనిప్రదేశాలన్నింటికీ ఉదాహరణగా నిలిచింది.

అమెజాన్ చరిత్రలో యూనియన్ ఏర్పాటుకు చేసిన అత్యంత పెద్ద ప్రయత్నమిది. ఒక నెలరోజుల సంఘర్షణ తర్వాత, అల్బామాలోని బెస్సెమర్‌లో అమెజాన్ వేర్‌హౌస్ కార్మికులు 738 మంది యూనియన్ ఏర్పాటుకు అంగీకారం తెలపగా, 1,798 మంది నిరాకరిస్తూ ఓటు వేశారు. మరో 505 మంది కార్మికుల ఓట్లు అమెజాన్ చొరవతో ఛాలెంజ్ చేయబడి పరిశీలనకు గురయ్యాయి. అమెజాన్ చట్ట విరుద్ధంగా ఓటింగ్‌లో కల్పించుకుని, జాతీయ కార్మిక సంబంధాల బోర్డులో అన్యాయ ఆరోపణలతో జోక్యం చేసుకుంది. ప్రపంచంలో అత్యధిక సంపద కలిగిన జెఫ్ బోజెస్ నిర్వహించే అమెజాన్ సంస్థ, కార్మికుల వాదన వీగి పోయేందుకు మిలియన్ల డాలర్లు వెచ్చించింది. ఏవిధంగా చూసినా అమెజాన్ పనిపరిస్థితులతో తాము సంతృప్తి చెందామని కార్మికులెవరూ చెప్పటం లేదు. యూనియన్ అవసరమని చెబుతూ ఓటు చేయటానిక తాము భయపడ్డామని వారు చెబుతున్నారు.

యజమానుల ప్రయోజనాలకనుగుణంగా; మరోవైపున కార్మికులు సంఘటితపడటం ఎంతో కష్టమైనదిగా, పకడ్బందీగా రూపొందించబడిన కార్మిక చట్టాలున్న దేశంలో, బెస్సెమెర్‌లోని అమెజాన్ కార్మికులు సంఘటిత పడేందుకు ప్రయత్నించటం పరిగణించదగింది.

ఫలితం ఏమైందనే దానితో నిమిత్తం లేకుండా అమెజాన్ యూనియన్ ఏర్పాటు ప్రయత్నం వెనుకనున్న కార్మికులు-ఇటీవలికాలం వరకూ దృఢంగా, కదిలించలేనిదిగా కన్పించిన, దీర్ఘకాలంగా కొనసాగుతున్న యూనియన్ వ్యతిరేక సంస్కృతిపై సిద్ధాంతపరంగా, చాతుర్యంగా పోరాటం సాగించి, గుర్తించదగిన పురోగతిని సాధించారు.

50 సంవత్సరాల క్రితం అమెరికాలోని కార్మికుల మొత్తం సంఖ్యలో మూడవవంతు పైగా కార్మికులు యూనియన్‌లలో వుండేవారు. ఈనాడు అత్యధిక కార్మికులు ఎవరికి వారుగా వుంటున్నారు. అమెరికా ప్రైవేటురంగంలోని మొత్తం కార్మికులలో కేవలం 6.4శాతం మాత్రమే యూనియన్లలో వుండి, అమెజాన్, వాల్‌మార్ట్, లేదా ఇతర బడాయాజమాన్య సంస్థలలోని కార్మికుల ప్రయోజనాలకోసం ఏమీ చేయలేని స్థితిలో వున్నారు.

50 సం॥ల క్రితం దేశంలో కార్మిక చట్టాలు అమలయ్యే విధంగా తగినంత రాజకీయ ప్రభావాన్ని కార్మికోద్యమం కలిగివుండేది. ఫలితంగా ప్రభుత్వాలు కూడా జి.ఎమ్.వంటి దిగ్గజ సంస్థలలో మధ్య తరగతి మనగలిగే విధంగా వత్తిడి తేగలిగేవి. ఆనాటితో పోలిస్తే ఈనాడు సంఘటిత కార్మికోద్యమం రాజకీయంగా స్వల్పంగా మాత్రమే ప్రభావితం చేయ గలుగుతోంది.

అమెజాన్ వంటి దిగ్గజ కార్పొరేషన్లే అత్యంత పెద్ద రాజకీయశక్తులుగా కూడా వున్నాయి. పనిహక్కు చట్టాన్ని వెనక్కునెట్టటానికి, కార్మిక రక్షణలను నీరుగార్చటానికి, జాతీయ కార్మిక సంబంధాల బోర్డులో సిబ్బందిని తగ్గించి వేసి, దానిపై పనిభారం పెంచటానికి, యూనియన్లను అంతమొందించే దుర్మార్గమైన ఎత్తుగడలను అనుమతించే విధంగా, అవి తమ రాజకీయ ప్రాబల్యాల్ని ఉపయోగిస్తున్నాయి.

అంతేగాక, పరిశ్రమలపై విధించిన పన్నులను తగ్గించుకునేందుకు; పరిశ్రమల ఏర్పాటుకు వసతులు కల్పించాల్సి వుంటుందనే షరతులతోపాటు, పన్నురాయితీలతో రాష్ట్రాలను దోచుకునేందుకు; తమ కేంద్ర కార్యాలయాలున్న నగరాలను బెదిరించేందుకు; ఒప్పంద కార్మికులతో పనిచేయంచే విధంగా వాణిజ్య ఒప్పందాలు రుద్దేందుకు దిగ్గజ పరిశ్రమలు తమ రాజకీయ బలాన్ని ఉపయోగిస్తున్నాయి.

అమెరికాలో అవుట్‌సోర్సింగ్ (పొరుగు సేవల) కార్మికులుగా వున్న వారు అతితక్కువ వేతనంతో, చాలా ఎక్కువ వత్తిడిని ఎదుర్కొంటూ శ్రమిస్తున్నారు. ఒప్పంద వ్యతిరేక చట్టాలను బడాపరిశ్రమలు పెంచిపోషిస్తున్నాయి. మొదటి దశలో అమెజాన్‌వంటి కంపెనీలు మాత్రమే ఈ తరహాలో వుండేవి.

కార్పొరేటు కంపెనీలు కార్మికుల యూనియన్లను కాలరాచి వేస్తుండగా, మరోవైపున కార్పొరేటు లాబీ బాగా దృఢపడుతూ యూనియన్‌ల ప్రతి చిన్న విషయంలోనూ జోక్యం చేసుకుంటున్నాయి. కార్మికులకు సంఘటితపడే హక్కును కల్పించే పిఆర్ఓ చట్టాన్ని 'శాసనసభలో చేసిన నీచమైన చట్టం'గా నేషనల్ రీటైల్ ఫెడరేషన్ వ్యాఖ్యానించింది.

"అబ్రహాం లింకన్ లీడర్‌షిప్ ఫర్ అమెరికా అవార్డు" మరియు "జెఫర్‌సన్ – హామిల్టన్ అవార్డు ఫర్ బైపార్టిజన్‌షిప్"ల పేరుతో అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రచార విరాళాలు సేకరించి 15 డాలర్ల కనీస వేతనాన్ని అడిగిన వారిని చంపాలనే ప్రతిపాదనకు ఓటువేసిన సెనేటర్లను అభినందించింది.

బడాకార్పొరేటు సంస్థలు పైకి ఎగబాకు తుండగా, కార్మిక యూనియన్లు అదృశ్యంకావటం, సంపద, ఆదాయాల పునఃపంపిణీ భారీగా సాగేవిధంగా ఈ దశాబ్దపు పెద్ద అధికార బదలాయింపు జరిగింది. అమెరికాలో 0.1 శాతం అత్యధిక సంపన్నుల వద్దే, అట్టడుగునున్న 90శాతం ప్రజల మొత్తం సంపద పోగుపడి వుంది.

ఈ అధికార బదలాయింపును వెనుకకు మరల్చవచ్చు; అది కేవలం చాలా బలమైన కార్మిక చట్టాల, మరిన్ని యూనియన్ల స్థాపన, కఠినమైన వాణిజ్య ఒప్పందాల ద్వారానే సాధ్యమౌతుంది. అమెజాన్ కార్మికుల యూనియన్ ఏర్పాటు ప్రయత్నం తర్వాత, అమెరికా దేశవ్యాపితంగా ప్రథమశ్రేణి కార్మికులతో సహా వివిధ రంగాల కార్మికులు తమకు మెరుగైన వేతనాలకొరకు, సౌకర్యాల కొరకు, రక్షణ, భద్రతల కొరకు విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్నారు.

అణచివేత తీవ్రమౌతున్న కొద్దీ పోరాటాలు కూడా పెరుగుతున్నాయి. 120 ఏళ్ళకాలం నాటి పరిస్థితులు –'గిల్డెడ్' (వృత్తి పనివారి) యుగానికి చెందిన ఆధిక్యతలను పడదోస్తున్నాయి. ఆ సమయంలో పెట్టు

బడిదారీ వ్యవస్థ 'సంస్కరణ'లతో తనను తాను రక్షించుకో గలిగింది. అయితే నేడు కార్మికులు విప్ల వంకోసం పోరాడాలి.